రూ.1.35 కోట్లు.. రోడ్డు పాలు.!

- మూడు నెలలకే పెచ్చులూడుతున్న గునిపూడి–గోపాలపట్నం తారురోడ్డు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. కూటమి సర్కారు నిర్వాకంపై ప్రజల ఆగ్రహం


గునిపూడి నుంచి గోపాలపట్నం మధ్య వేసిన తారురోడ్డు

నక్కపల్లి: కూటమి సర్కారు వేల కోట్లు వెచ్చించి.. వేల కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించామంటూ గొప్పలు చెప్పుకంటూ ఉంటే.. మరో పక్క వేసిన రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. నిర్మించిన రెండు నెలలకే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కూటమి నేతల కమీషన్ల, కాంట్రాక్టర్ల కక్కుర్తి, అధికారుల మామూళ్ల కారణంగా కోట్లాది రూపాయల వెచ్చించి నిర్మించిన రోడ్లు వెంట వెంటనే పాడవుతున్నాయి. ఫలితాంగా కోట్లాది రూపాయల ప్రజాధనం రోడ్డు పాలయ్యాయని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నక్కపల్లి మండలం గునిపూడి నుంచి పాయకరావుపేట మండలం గోపాలపట్నం వరకు ప్రత్యేక మరమ్మతుల పథకం కింద రూ.1.35 కోట్లు వ్యయంతో తారురోడ్డు మంజూరు చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన ఈ రోడ్డు పనులకు ఈ ఏడాది జనవరి 11న శంకుస్థాపన చేశారు. అయితే రోడ్డు పనులు మాత్రం రెండు నెలల క్రితమే


రోడ్డు మధ్యలో తారు పెచ్చులుగా ఊడుతున్న దృశ్యం


ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభించినట్లు ఏర్పాటు చేసిన శిలా ఫలకం

పూర్తయ్యాయి. వేసిన కొద్ది రోజులకే రోడ్డుపై వేసిన తారు పెచ్చులు పెచ్చులుగా ఊడి పోతోంది. రోడ్డు అంచులు కూడా శిథిలమయ్యాయి. నాశిరకం మెటీరియల్ ఉపయోగించడంతో రోడ్డు పాడైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు కాంట్రాక్టర్ కూటమి నాయకులకు, అధికారులకు మామూళ్లు ఇవ్వడం వల్ల వారెవరూ అటు వైపు కన్నెత్తి చూడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ లోపం కారణంగా రోడ్డు నిర్మాణంలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యమైన ఇసుక గ్రావెల్, తారు ఉపయోగించలేదని, రోలింగ్ కూడా సరిగ్గా చేయలేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో కూలీల ఖర్చు కింద రూ.2.67 లక్షలు, సామగ్రి కోసం రూ.1.32 లక్షలు ఖర్చు చేశారు. పనులు పూర్తయిన 3 నెలలకే రోడ్డు ఇలా తయారయితే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు జరిగిన సమయంలో అధికారులెవరూ ఇటువైపు వచ్చి పరిశీలించిన దాఖలాలా లేవు. దీంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


చేత్తో తీస్తే ఊడిపోతున్న రోడ్డు పెచ్చులు

క్లుప్తంగా

గంగాలమ్మతల్లి గుడికి విరాళం


గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు దాతలు ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం పాటిపల్లికి చెందిన బొడ్డేడ లక్ష్మణరావు, నాగలక్ష్మి దంపతుల కుమారులు ప్రసాద్, సాయి, మధు రూ.10,516 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు.

తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవో ఇందిరాదేవి

మునగపాక: తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రం–2ను మంగళవారం ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవో ఇందిరాదేవీ సందర్శించారు. కేంద్రంలోని పిల్లల హాజరు పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందుతుందా? లేదా? అని ఆరా తీశారు. కేంద్రానికి వచ్చే పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, బాలింతలు, గర్భిణులకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

మునగపాక: మునగపాక మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ హాలులో ఉదయం 11 గంటలకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానంద్‌కు ఘన నివాళి


కేరళ మాజీ సీఎం అచ్యుతానంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు

మునగపాక: ప్రజా సేవకు తన జీవితాన్ని త్యాగం చేసిన కేరళ మాజీ సీఎం, దివంగత నేత అచ్యుతానంద్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీఎం నాయకుడు ఆళ్ల మహేశ్వరరావు కోరారు. మునగపాకలో మంగళవారం స్టేట్‌బ్యాంక్ దరి సమీపంలో అచ్యుతానంద్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన అచ్యుతానంద్ తన జీవితాంతం ప్రజా సమస్యల కోసం పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఎస్.బ్రహ్మాజీ, ఎంవీఎస్ నారాయణ, టిక్కలి జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కోటవురట్ల: కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థుల నుంచి రక్తపూతలు సేకరించి పరీక్షలు చేశారు. హెచ్‌ఎం ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లోవరాజు, ఎంఎల్‌హెచ్‌పీ మణికుమారి, ఏఎన్‌ఎం సత్యవతి, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి


లింగాపురంలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారశుధ్యం మెరుగుకు సహకరించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఐవీఆర్ఎస్ గ్రామాలు లింగాపురం, తంగేడులో ఎంపీడీవో చంద్రశేఖర్ మంగళవారం పర్యటించారు. డ్రైనేజీలలో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి కుళాయిల నుంచి నమూనా సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు కాచి వడకట్టిన నీటినే తాగాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.కూర్మారావు, ఈవోపీఆర్డీ రఘురాం, వైఎస్సార్ సీపీ నాయకుడు కొరుప్రోలు రమణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: ఆర్‌ఎస్‌ఎస్ పనుల నిమిత్తం యలమంచిలి సెక్షన్ పురుషోత్తపురం 33/11కేవీ ఉపకేంద్రం పద్మనాభరాజుపేట ఫీడర్ పరిధిలో పులపర్తి, పీఎన్‌ఆర్ పేట, బయ్యవరం గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆశీర్వదించండి.. సేవ చేస్తా..

- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ
- కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు


మార్టూరు గ్రామంలో పర్యటిస్తున్న కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: సొంత నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని, అందరూ ఆశీర్వదిస్తే నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం ఆయన యలమంచిలి ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం రాజకీయ ప్రాధాన్యత కలిగిన కొఠారు రాంబాబు కుటుంబీకులను, మాజీ ఎంపీ, టీడీపీ సీనియర్ నాయకుడు పప్పల చలపతిరావును వారి ఇళ్లకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, లాలం రాంబాబు, శంకర్రావు, శ్రీనివాసరాజు, నెట్టెం సత్యనారాయణ, యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అర్రెపు గుప్తా, దూది నర్సింహమూర్తి, గోకివాడ వెంకటసూరి మాస్టారు, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న కరణం ధర్మశ్రీ

మార్టూరులో పర్యటన

అచ్యుతాపురం: వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మంగళవారం అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పర్యటించారు. పలువురు సీనియర్ నేతల ఆశీస్సులు తీసుకున్నారు. అచ్యుతాపురం మండలంలోని మార్టూరు గ్రామంలో బాబ్జీబాబు, రమేశ్ బాబు, ఎంపీటీసీ లక్ష్మితో పాటు పలువురిని కలిసి, మద్దతు కోరారు.

ఘనంగా 'పై' దినోత్సవం


పై విలువను చార్ట్‌లతో వివరిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో 'పై' దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయురాలు స్వర్ణ గౌరీ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గణితాన్ని అభ్యసించడం, నేర్చుకోవడం ద్వారా జీవితానికి పరిపూర్ణత వస్తుందన్నారు. వేగం, కచ్చితత్వాన్ని ప్రదర్శించగలరని చెప్పారు. పై అనేది వృత్తం చుట్టు కొలత, దాని వ్యాసం మధ్య నిష్పత్తిని సూచిస్తుందని వివరించారు. పై అనేది గ్రీకు అక్షరమని, దీని ఉజ్జాయింపు విలువ 22/7 అని విద్యార్థులకు తెలియజేశారు. పై అక్షరాల చార్జ్‌లను ప్రదర్శించారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

- పని ప్రదేశంలో కానరాని సౌకర్యాలు
- పెండింగ్ వేతనాలపై సీపీఎం నాయకుల నిరసన
- మునగపాకలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక


ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నినదిస్తున్న కమ్యూనిస్టులు

మునగపాక: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని కోరుతూ ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, బ్రహ్మాజీలు ప్లకార్డులు చేతపట్టి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గతంలో నమోదు చేసిన రికవరీలు ఎంతమేర వసూళ్లు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందుకు డుమా పీడీ పూర్ణిమాదేవి బదులిస్తూ గ్రామాల వారీగా నివేదికలు పూర్తి కాగానే కూలీల సమస్యలపై ఇచ్చిన వినతులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలు సస్యశ్యామలంగా తయారవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఏపీవో శివ, పలువురు ఉన్నతాధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు మంజూరు చేయరూ!

ఎంపీటీసీల ఆవేదన

మునగపాక: ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు వారంతా. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి వెచ్చిస్తూ ఉంటారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా నిలుస్తుంటారు. వారే ఎంపీటీసీలు. ప్రతి ఎంపీటీసీకి ప్రభుత్వం నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం అందిస్తుంటుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంతవరకు ఎటువంటి వేతనాలు అందించలేదు. ప్రజాప్రతినిధుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమంటూ పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రతి నెలా ఇవ్వాల్సిన గౌరవ వేతనం మంజూరు చేయడంలో ప్రభుత్వం ఎందుకు చిన్న చూపు ప్రదర్శిస్తుందో అర్థం కావడం లేదని టి.సిరసపల్లికి చెందిన ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు వాపోయారు. ఇచ్చే గౌరవ వేతనం తక్కువైనప్పటికీ సకాలంలో అందించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెలా గౌరవ వేతనం సకాలంలో అందించేలా చూడాలని పలువురు ఎంపీటీసీలు కోరుతున్నారు.


మునగపాక మండల పరిషత్ కార్యాలయం

నారుమళ్లలో సస్యరక్షణ చర్యలు అవసరం


ఒడ్డిమెట్లలో నారు సంరక్షణకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

నక్కపల్లి: వరినారుమళ్లలో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా తెగుళ్ల బారి నుంచి వరి పంటను కాపాడుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన నక్కపల్లి మండలంలో గొడిచర్ల, ఒడ్డిమెట్ట తదితర గ్రామాల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారుమళ్లలో ట్రైకోడెర్మా పొడి మందును పశువుల గెత్తంలో కలిపి వాడే విధానాన్ని ప్రదర్శించి చూపించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ పాడతెగులు ఆశించిన తర్వాతే మందులు వాడటం కన్నా తెగుళ్లు రాకుండా చూసుకోవడం ఉత్తమమని చెప్పారు. వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ మాట్లాడుతూ నారుమడులలో కలుపు ఎక్కువైతే నియంత్రించడానికి 20–25 రోజుల వయసు మడిలో బిస్‌పైరిబ్యాక్ సోడియం కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి సత్యనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగేశ్వరరావు, రాము, రజనీ, శిరీష పాల్గొన్నారు.


నామవరంలో నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


పాయకరావుపేట: నామవరం గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ వరి నారుమడిలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీహరి మాట్లాడుతూ కూరగాయల సాగులో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


సర్వసిద్ధిలో వరి నారును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎస్.రాయవరం: వర్షాభావం కారణంగా ఎండుతున్న నారుమడులను కాపాడుకునే ప్రయత్నాలు చేయాలని ఏవో సౌజన్య సూచించారు. సర్వసిద్ధి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గణేష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ సమృద్ధి స్థాపక ప్రణాళికపై అవగాహన

నక్కపల్లి: పొదుపు సంఘాల సభ్యులు తమ సంఘాల అవసరాలు, జీవనోపాధి పెంపు కోసం గ్రామ సంఘాల సమావేశంలోనే ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమెదు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో గ్రామ ఐక్య సంఘాలు, మండల మహిళా సమాఖ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వీవోఏలు, సీఆర్‌పీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల అవసరాలను, సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నారు.. ఎటువంటి జీవనోపాధి కార్యక్రమాలు చేపడుతున్నారు.. భవిష్యత్‌లో మరింత ఆర్థికంగా బలపడడానికి తీసుకుంటున్న చర్యలు.. అవసరమైన వనరుల సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధి ప్రణాళికలను గ్రామ సంఘాల సమక్షంలోనే రూపొందించుకోవడం, ఆమోదించుకోవడం, సలహాలు, సూచనలు పొందడం చేయాలన్నారు. జీపీడీపీ ప్లాన్‌లో పంచాయతీ కార్యదర్శి సహకారంతో నూరు శాతం నమోదు చేసుకోవాలన్నారు. సముద్ర నాచు కోసం, పశుగ్రాసం గురించి, పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ కనెక్షన్, ప్రకృతి వ్యవసాయం, స్త్రీనిధి రుణాల కోసం ఆయా శాఖల సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అప్పారావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనంతలక్ష్మి, కార్యదర్శి మాధురి, సీసీలు రాజు, అప్పారావు, కోటి నాగప్రసాద్, సిబ్బంది దేవేనమ్మ పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్

ఎంఈవో–2 శ్రీరామమూర్తికి అభినందనలు


ఎంఈవో–2 శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎంఈవో–2 శ్రీరామమూర్తిని మంగవారం పీఆర్‌టీయూ సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎంఈవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలు, శర్మ, చక్రవర్తి, రమేష్ ప్రకాష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగాయి. వేంపాడు, చినదొడ్డిగల్లు, జానకయ్యపేట తదితర గ్రామాల్లోని కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. వీధుల్లో చెత్తను తొలగించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయా పనులను ఎంపీడీవో సీతారామరాజు పర్యవేక్షించారు.

సచివాలయ సిబ్బందితో సమావేశం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమంపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. శానిటేషన్ కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఎంపీడీవో కోరారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


చినదొడ్డిగల్లులోపారిశుధ్యపనులు చేయిస్తున్న ఎంపీడీవో

గోకివాడ మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డికి ఘన నివాళి

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని గోకివాడలో మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి అప్పారావు పెద్దకర్మ కార్యక్రమం జరిగింది. గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన అప్పారావు మరణం తీరని లోటు అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, అప్పారావు కుటుంబ సభ్యులు ద్వారపురెడ్డి గోవిందరావు, నాగేశ్వరరావు, కొటారు పద్మ, నీరుకొండ శారద వెంకట సూర్యనారాయణ పాల్గొన్నారు.


అప్పారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ

సర్వేకు సహకరించాలి

మునగపాక: పాటిపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. మంగళవారం పాటిపల్లి పంచాయతీ పరిధిలోని నారాయుడుపాలెం గ్రామస్తులు కలిసి తమ గ్రామంలో జరుగుతున్న సర్వేను నిలుపుదల చేయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఆయన పంచాయతీ పరిధిలో జరుగుతున్న సర్వేకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలన్నారు. అందరి ఆమోదం ఉంటేనే లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ విషయం గ్రహించి సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్య శేషు, చక్రం, మూర్తి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

నక్కపల్లి: వచ్చే నెల 6న నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బల్క్ డ్రగ్‌పార్క్ కోసం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. రాజయ్యపేటలో మంగళవారం సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆరు నెలల క్రితం విశాఖ నుంచి ఈ పార్క్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేసినప్పటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజల ప్రాణాలకు, మత్స్యకారుల జీవనోపాధికి తీవ్ర విఘాతం కలిగించే ఈ పార్క్ ఏర్పాటును కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ప్రజలు వ్యతిరేకించడంతో నక్కపల్లి మండలానికి తరలించారన్నారు. తీరాన్ని విష వాయువులు, వ్యర్థాలతో డంపింగ్ యార్డ్‌గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజల ఆమోదం మేరకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత గతంలో ప్రకటించారని, ఇప్పుడు ఏ గ్రామంలో ఎంత మంది ఆమోదం తీసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మహేష్, కాశీరావు, భూలోక, కారే లక్ష్మి, సత్తియ్యమ్మ, దేముడు, సింహాచలం పాల్గొన్నారు.


రాజయ్యపేటలో సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజు తదితరులు